క్లుప్తంగా

నీటి తీరువా వసూలు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: గ్రామాల్లో రైతుల నుంచి నీటితీరువా వసూలు చేయాలని తహసీల్దార్ ఎం.సరిత సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీటి తీరువా వసూలులో అలసత్వం వహించే వీఆర్‌ఓలపై చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కారమయ్యేలా సంబంధిత వీఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామకృష్ణరావు, ఏఓ వై.శారద, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాయినింగ్ ఉత్తర్వులు అందజేత



ఉపాధ్యాయులకు జాయినింగ్ పత్రాలను అందజేస్తున్న ఎంఈఓలు

జి.సిగడాం: మండలంలోని పలు పాఠశాలలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సమన్వయంతో విధులు నిర్వహించి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంఈఓలు అరసాడ రవి, ముఖ్ల శ్రీనివాసరావు అన్నారు. బదిలీపై వచ్చిన సబ్జెక్టు ఉపాధ్యాయులతో సోమవారం ఎమ్మార్సీలో మాట్లాడారు. ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు అంకిత భావంతో పని చేసి జిల్లా స్థాయిలో మండలాన్ని నంబర్ వన్‌గా నిలపాలన్నారు. ఉపాధ్యాయులకు జాయినింగ్ ఉత్తర్వులను అందించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి రమణమూర్తి, కుదమ తిరుమలరావు, మొదలవలస రమణమూర్తి, సదాశివుని రవి, ఎందువ వెంకటరమణ, కిల్లారి వెంకటరమణ పాల్గొన్నారు.

యువనేత పరామర్శ



అప్పలరామును పరామర్శిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పాత్రునివలస గ్రామానికి చెందిన బొంతల అప్పలరామును సోమవారం పరామర్శించారు. అప్పలరాము, ఆయన కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన కొందరు ఇటీవల దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న రామ్‌మనోహర్‌నాయుడు అప్పలరామును పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు బాణాల దాలినాయుడు, బుడ్డి గణేష్ తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులుకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరం గ్రామంలో సోమవారం వికాసిత కృషి సంకల్పిత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.చిట్టిబాబు మాట్లాడారు. వరిలో ఉన్న రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, కలుపు మందుల వాడకం, సస్యరక్షణ కోసం వివరించారు. ఉద్యానవన శాస్త్రవేత్త పి.అశోక్ మాట్లాడుతూ జీడి, మామిడి, కొబ్బరికి ఆశించిన నల్లముట్టు, పురుగు, కొమ్ముపురుగు, తెల్లదోమ నివారణా చర్యలను వివరించారు. డాక్టర్ హేమ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ, పంటలను నిల్వ ఉంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలో అమలు పరిచే కార్యక్రమాలను వివరించారు. ఇక్కడ వృత్తి, నైపుణ్యత శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఫేర్‌నెట్ ద్వారా పెంపకాల ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. వరి, వేరుశెనగ విత్తనాలను అందిస్తామన్నారు. ఉద్యాన పంటలు, నారు పెంపకం, కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం గురించి వివరించారు. మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి దుర్గాప్రసాద్, పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రణస్థలం: మండలానికి ఉపాధి పథకం అడిషనల్ ఏపీఓగా బి.పార్వతి సోమవారం విధుల్లో చేరారు. సరుబుజ్జిలి నుంచి ఈమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఏపీఓగా శ్రీనివాసనాయుడు విధులు నిర్వహించారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం



జి.సిగడాం: అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

గార: యోగాతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా వ్యాధులను తరిమి వేయవచ్చునన్నారు. గార మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి మాట్లాడుతూ.. జీవితంలో నిత్యం యోగ భాగం కావాలని అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి వైఎస్సార్ జంక్షన్ (మూడు రోడ్లు కూడలి) వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కూర్మారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రామకృష్ణ యోగా చైతన్య ధార్మిక సంస్థ గురువు మీసాల రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీరోజు ఉదయం గంట సమయం యోగా చేయాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపడీఓ జి.రామకృష్ణారావు, ఎంఈఓ -2 ముఖ్ల శ్రీనివాసరావు, ఏఓ యర్రా శారద, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఈసీ గేదెల పురిషోత్తంనాయుడు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

యోగాతో మానసిక ప్రశాంతత

ఎచ్చెర్ల: నిత్యం యోగా చేయడం వలన ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కలుగుతుందని లావేరు తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ పి.వెంకటరావు తెలిపారు. యోగాంధ్రాలో భాగంగా లావేరు పంచాయతీలో అవగాహన ర్యాలీ, మానవహారం చేపట్టారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి..

రణస్థలం: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా జీవితంలో భాగం కావాలని తహసీల్దార్ ఎస్.ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో అధికారులంతా యోగాంధ్ర ర్యాలీ చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



గార మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న అధికారులు



ఎచ్చెర్ల: లావేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

అక్షరంపై దాడి.. సిగ్గు సిగ్గు

ప్రజా వ్యతిరేకత వస్తుందని



కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాది దాటింది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. వీటిని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి దాడులు చేస్తున్నారు.

– బూటు అప్పారావు, బాతువ, జి.సిగడాం

వెన్నుపోటు దినం చూసి ఓర్వలేకే..



జగనన్న పిలుపు మేరకు ఈ నెల 4న నిర్వహించిన వెన్నుపోటు దినంకు జనాల స్పందన చూసి కూటమి నాయకులు ఓర్వలేకపోయారు. అందుకే సాక్షి కార్యలయాలపై దాడులకు పూనుకున్నారు.

– కలిశెట్టి శాంతారావు, బాతువ, జి.సిగడాం మండలం

ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం



సాక్షి కార్యాలయం గోడలు ఎక్కి ఆస్తులు ధ్వంసం చేయడం రెడ్ బుక్ రాజ్యాంగమే. జిల్లాలో ఇలాంటి సంప్రదాయాలు తీసుకురావడం పద్ధతి కాదు. అవసరమైతే చట్టాలు ఉన్నాయి.

– మీసాల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?



సాక్షి ఆస్తులను ధ్వంసం చేయడం పద్ధతి కాదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

– దోల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు

తిరునక్షత్రం పూజలు



శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో నమ్మాళ్వార్ తిరునక్షత్రం పూజలు సోమవారం భక్తితో జరిగాయి. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు నిర్వహణలో స్వామివారికి అష్టోత్తర నామాలతో పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

అపూర్వ కలయిక



శ్రీకాకుళంలోని టీపీఎంహెచ్ స్కూల్‌లో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం సాయంత్రం ఆతీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులు, స్నేహబంధాలు, అల్లరి పనులు గుర్తు చేసుకున్నారు. డ్యాన్సులతో, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చదువు చెప్పిన టీచర్లకు సత్కరించి గౌరవించారు. గ్రూప్‌ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. గురువులు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, భువనేశ్వరి, సాంబమూర్తి, పూర్వ విద్యార్థులు గోవింద్, లక్ష్మణ్, నవీన్, స్వాతి, సురేష్, గాంధీ పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

గ్రామదేవతలకు మాజీమంత్రి పూజలు



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో జరుగుతున్న గ్రామదేవతల పండుగలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పాల్గొన్నారు. బాదుర్లపేట, పాతశ్రీకాకుళం, నక్కవీధి, దేశెల్లవీధిలను సందర్శించిన ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లకు ఒకసారి జరిగే ఉత్సవం ద్వారా ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు డి.పి.దేవ్, రామలింగస్వామి, గంజి వాసు, పాపారావు గురుస్వామి, జోగినాయుడు, రంగాజి దేవ్, ధర్మాన రఘు, చల్లాశ్రీను, బైరి మురళీధర్, తాతబాబు, నక్క రామరాజు, శ్రీధర్, ఇంజిరాపు రమేష్, ఎంఏ బేగ్, నక్క శంకరరావు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



రిలయన్స్‌స్మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణా కాకుండా ఉండేందుకు నార్కోటిక్ డాగ్‌తో సహాయంతో స్థానిక రైల్వేస్టేషన్, రిలయన్స్ స్మార్ట్ షాపింగ్ మాల్‌లో సోమవారం పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్ వేదికగా ఈనెల 28 నుంచి జూలై ఒకటో తేదీ వరకు జరగనున్న మొదటి జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్ల ఎంపికలు బుధవారం జరగనున్నాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని జేఎన్‌టీయూ క్రీడామైదానం వేదికగా ఈనెల 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఏపీ రాష్ట్ర జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలు జరుగుతాయని శ్రీకాకుళం జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాదు ముసలినాయుడు పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, బరువు ప్రామాణికత లేదని స్పష్టం చేశారు. 2007 జూన్ 28 తర్వాత జన్మించిన వారు మాత్రమే ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు. కాగా ఈ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆర్గనైజింగ్ సెక్రటరీ సాధు శ్రీనివాసరావు(సెల్: 9441914214) తెలియజేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని వెల్లడించారు.

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు రద్దు చేయాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్



మాట్లాడుతున్న యుగంధర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. ఐపీఎల్ కార్పొరేట్ లాభాల కోసం నిర్వహించే కమర్షియల్ ప్రాజెక్టుగా మారాయని దుయ్యబట్టారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐపీఎల్ మ్యాచ్‌ల కారణంగా నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ప్రవేశించి యువతను వ్యసనాల వైపు నెట్టుతున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలు, పేరు మోసిన క్రికెటర్లు తమ సొంత ఫ్రాంచైజీలను స్థాపించి ఐపీఎల్ మ్యాచ్‌లను బెట్టింగ్ యాప్‌ల స్పాన్సర్‌షిప్ ద్వారా నిర్వహించే వరకు పరిస్థితి మారిందన్నారు. ఈ క్రమంలో తమ అభిమాన క్రికెటర్ల ప్రభావానికి యువతలోనై బెట్టింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి పెద్ద ఎత్తున డబ్బులు పోగొట్టుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. చాలా మంది విద్యార్థులు, నిరుద్యోగ యువకులు తమ డబ్బులు ఖర్చు చేసి అప్పుల పాలై వ్యసనపరులుగా మారారని అన్నారు.

క్రీడా స్ఫూర్తి కంటే బెట్టింగ్‌ను ప్రోత్సహించే ప్రకటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. క్రీడలు, క్రీడలుగా కాకుండా వ్యాపార, వ్యసన కేంద్రాలుగా మారి అమాయకు యువతను బలి తీసుకోవడాన్ని ఏఐవైఎఫ్ ఖండిస్తుందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, నాయకులు రామోజీ, కిశోర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో గల దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చల్లాగా చూడు తల్లీ అంటూ భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దుర్గాదేవి విగ్రహం

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

టెక్కలి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ ల్యాబ్‌లలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ ఎస్.విజయలక్ష్మి, ఎన్‌జీఓ ప్రతినిధి డి.రమాదేవి, వైద్యుడు ఎస్.రాజశేఖర్, ధనలక్ష్మి, న్యాయవాది డి.వివేకానంద పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికిపోవద్దు



పోలీసులతో కలిసి ప్రచారం చేస్తున్న కళాకారులు

కంచిలి: ప్రస్తుత సమాజంలో యువతను చిదిమేస్తున్న మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి జోలికి పోవద్దంటూ ఢీ, జబర్దస్త్ ఆర్టిస్టులు ప్రచారం చేశారు. ఆదివారం రాత్రి కంచమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా స్టేజి షో ఇవ్వడానికి వచ్చిన ఆర్టిస్టులు కొంత సమయం ఈ మేరకు స్థానిక పోలీసుల సూచనల మేరకు అవగాహన కల్పించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు ఉపయోగించినట్లెతై టోల్ ఫ్రీ నంబర్ 1072కు తెలియపరచాలని ఈగల్ టీం సభ్యులు కోరారు. సోంపేట సీఐ బి.మంగరాజు, ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు, కంచిలి ఎస్సై పి.పారినాయుడు, ఈగల్ టీం సభ్యుడు సంతోష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెరిగిన కలాసీల కూలి



ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న సంఘం ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న కలాసీల కూలి పెంచుతూ ఆయా వ్యాపార వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. కూలి రేట్లను పెంచాలని మూడు రోజులుగా చేపట్టిన సమ్మెతో సోమవారం వ్యాపారవర్గాలు, కలాసీల మధ్య సమన్వయ సమావేశంతో పాటు చర్చలు నిర్వహించారు. దీంతో ప్రస్తుతం ఉన్న రేట్లకు 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన కూలి రేట్లు మూడు సంవత్సరాల వరకు అమలులో ఉండే విధంగా ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా టెక్కలిలో కలాసీలకు కూలీ రేట్లు పెంచినట్లు వర్తక సంఘం ప్రతినిధులు వెల్లడించారు. సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు, ఎరువుల వ్యాపారి దోని కొండలరావుతో పాటు డోకి రాజేష్, వై.గోవింద్, ఎం.గోవింద్, కలాసీ సంఘం అధ్యక్షుడు జానీ, ఎల్.వేణు, జి.నాగేశ్వరరావు, వసంత్, వై.బాలరాజు, బాబూరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.